సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



భక్తుల తాకిడి

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. విశేష పూజలు జరిగాయి. ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



రక్తదానం మహోన్నతం

సాక్షి, భీమవరం: భీమవరంలో శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు పి.రామబద్రిరాజు పాల్గొన్నారు.



భారీ ఊరేగింపు

ఆకివీడు : ఆకివీడులో బొజ్జ గణపయ్య భారీ ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. శక్తివేషాలు, గరగ నృత్యాలు, తీన్‌మార్ నృత్యాలతో ఊరేగింపు అట్టహాసంగా సాగింది.



వేలూర్పులో మార్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

మహిళా మార్ట్‌లతో ఉపాధి

తణుకు టౌన్: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మహిళా మార్ట్‌లు దోహదపడతాయని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. వేల్పూరులో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా మార్ట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. పేదరిక నిర్మూలన, మహిళలకు ఉపాధి కల్పనలో దేశంలోనే రాష్ట్రం తొలి స్థానంలో ఉందని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా మార్ట్‌లు ప్రారంభిస్తున్నామన్నారు. త్వరలో తణుకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మార్ట్‌ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ మహిళా మార్ట్‌ల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఐఈఆర్‌పీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 3 నుంచి 5 వరకు పరిశీలిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి, ఎక్స్ అఫీషియో ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు డీఈఓ కార్యాలయ ఆవరణలోని సర్వశిక్షా భియాన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. 3న దృష్టి మాంద్యం, బధిర విభాగంలో 1 నుంచి 50 ర్యాంకు వరకు, 4న 51 నుంచి ఆఖరి ర్యాంకు వరకు, 5న బుద్ధి మాంద్యం విభాగంలో అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారిలో 158 మంది అభ్యర్థుల జాబితా జిల్లాకు చేరిందని వీరిలో ఎంఆర్ విభాగంలో 55 మంది, వీహెచ్‌లో 103 మంది ఉన్నారని పేర్కొన్నారు. మెరిట్, రోస్టర్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

14.8 మి.మీ వర్షపాతం

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 14.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ ఆదివారం తెలిపారు. పెంటపాడు మండలంలో 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

సచివాలయాలు దేశానికే ఆదర్శం

పెంటపాడు: రాష్ట్రాభివృద్ధికి సచివాలయాల వ్యవస్థతో పాటు, రైతుల అభ్యున్నతి కోసం ఆర్బీకేల నిర్మాణాలను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జగనన్న సేవలు దేశానికే ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం పడమర విప్పర్రులో సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారు. పార్టీ నాయకులు కోసూరి చంటిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం, మహాత్మాగాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో టీడీపీ అధినేత అధికారం అడ్డుపెట్టుకొని విచ్చలవిడి దోపిడీలు చేశారన్నారు. నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థ, రైతుల అభ్యున్నతి కోసం ఆర్బీకేల వ్యవస్థలను ఏర్పాటు చేసి వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. రూ.3 కోట్లతో కె.పెంటపాడు నుంచి గణపవరం వెళ్లే రహదారి కోసం రాత్రి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కె. పెంటపాడు నుంచి గణపవరం వయా విప్పర్రు మీదుగా రూ. 3 కోట్లతో సీసీ రోడ్డు సుమారు రెండు రోజుల్లో ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


విప్పర్రులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

పేదల పక్షపాతి సీఎం జగన్

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండలంలోని పడమర విప్పర్రు గ్రామంలో ఆదివారం రెండో రోజూ నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. పథకాలు సరిగా అందుతున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు దోపిడీకి పాల్పడితే నేడు జగనన్న కొన్ని లక్షల కోట్ల రూపాయలు ప్రజలందరికీ పథకాల రూపంలో అందజేస్తున్నారన్నారు. తొలుత మంత్రికి వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందర్రావు, విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం సభ్యుడు కోసూరి వెంకట్రాజు, సర్పంచ్ తెంటు జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కశిరెడ్డి నాగేశ్వరరావు (అబ్బాయి), ఎంపీటీసీ సభ్యురాలు యండ సరస్వతి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, సగర్ల కార్పొరేషన్ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య, ఏఎంసీ ఉపాధ్యక్షుడు జామి కృష్ణ, ఎంపీపీ దాసరి హైమావతి పార్టీ నాయకులు కోసూరి చంటిరాజు, పసల చంటి, కోసూరి సుబ్బరాజు, చినిమిల్లి వెంకయ్య, కశిరెడ్డి నాగేంద్ర భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చట్టానికి అతీతుడు కాదు

తప్పు చేసిన ఏ వ్యక్తి అయినా చట్టాలను తప్పక గౌరవించాలని, చంద్రబాబు చట్టాలు, న్యాయ వ్యవస్థకు అతీతుడు కాదని మంత్రి కొట్టు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం రాత్రి మండలంలోని పడమర విప్పర్రు గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేశారని టీడీపీ నాయకులు అనడం దారుణమన్నారు. కాపు జాతిని తాకట్టు పెట్టడం తగదని, చంద్రబాబుకు అమ్ముడుపోయిన వ్యక్తి పవన్ కల్యాణ్ అని అన్నారు. కాపులను వంచించిన చంద్రబాబు పవన్‌కు ఏమిచ్చాడన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీతిబద్ధంగా చేస్తున్న పరిపాలన వల్ల రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు సహకరించాలి

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: ఇంటి పరిసరాలతో పాటు రోడ్డు, డ్రెయినేజీల శుభ్రతను కూడా ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారానే ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామంగా రూపుదిద్దుకుంటుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరులో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, తదితరులు చీపుర్లు పట్టి వీధులను శుభ్రం చేశారు. అనంతరం మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామంగా నిలవాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ ఎవరికి వారుగా గ్రామ పరిశుభ్రతకు పాటుపడాలని కోరారు. తాను జిల్లా పరిషత్ చైర్మన్‌గా 2006లో నిర్వహించిన నిర్మల్ పురస్కార కార్యక్రమం ద్వారా జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానం, దేశంలో 3వ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, వారికి నగదు పారితోషికాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు చంద్రు శ్యామల, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ, గ్రామ కార్యదర్శి వి.గంగాధరరావుతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


తణుకు టౌన్: వేలూర్పులో చీపురు పట్టి వీధులు ఊడుస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

బీచ్‌లో ఇద్దరు యువకుల గల్లంతు

మొగల్తూరు: పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. మండలంలోని రామన్నపాలెం పంచాయతీ ఆకన వారితోటకు చెందిన 10 మంది యువకులు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పేరుపాలెం బీచ్‌కు వెళ్లారు. సముద్ర స్నానానికి దిగిన ఆకన సత్యప్రసాద్, కొమ్ముల శ్రీరామ చంద్ర మూర్తిలు గల్లంతు కాగా, మద్దుల సాయిని స్థానికులు రక్షించి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. సత్య ప్రసాద్(18) మృతదేహం తీరానికి కొట్టుకు రాగా, శ్రీరామచంద్రమూర్తి కోసం గాలిస్తున్నారు. సత్యప్రసాద్ 10వ తరగతి పాసై తండ్రి వ్యవసాయ పనుల్లో సహకరిస్తుండగా, శ్రీరామ చంద్రమూర్తి నరసాపురంలోని ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆకన సత్యప్రసాద్(ఫైల్)

ముత్యాలమ్మ ఉత్సవ ఏర్పాట్లకు అంకురార్పణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీ ముత్యాలమ్మ దేవస్థానంలో దసరా ఉత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ రాట పాతి ఉత్సవ ఏర్పాట్లను ప్రారంభించారు. తొలుత గణపతి పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారి మట్టి విగ్రహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాం ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ముత్యాలంబాపురం, ఉప్పాకపాడు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పందిరి రాట పాతుతున్న దృశ్యం









హరిత భారత్ కోసం కలిసి నడుద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో ఆదివారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యాన స్వచ్ఛ భారత్ నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ, జిల్లా ఉపాధ్యక్షులు నరిశె సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సాధనలో భాగస్వాములు కావాలి

తాడేపల్లిగూడెం రూరల్: స్వచ్ఛ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అలాగే గ్రామంలోని మంచినీటి చెరువు, పరిసరాల్లో పిచ్చిమొక్కలను తొలగించారు. ఎంపీటీసీ సభ్యుడు నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), ఈవో కె.శ్రీనివాసరెడ్డి, సచివాలయం-2 సెక్రటరీ జడ్డు ఫణీంద్రకుమార్, నాయకులు తమ్మాబత్తుల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగ గుంట గ్రామంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. సమావేశంలో కె.పోసేంద్రప్రసాద్, ఎ.రాంబాబు, పామర్తి జాన్, రేలంగి గంగరాజు, వెంకన్నబాబు, గుల్లపల్లి గంగాధర్, పోతుల శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో స్వచ్ఛ భారత్



శ్రమదానం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తాడేపల్లిగూడెం డిపో గ్యారేజీ, కాంప్లెక్స్‌లో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో ఆదివారం గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు. గడ్డి మొక్కలను తీసేసి, మొక్కలు నాటారు. అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, సూపర్‌వైజర్లు రమణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఈలి ఆంజనేయులు వీకర్స్ కాలనీ, నాల్గో వార్డు అమ్మ కల్యాణ మండపం వద్ద ఆది గణపతి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యాన భారీ అన్నసమారాధన జరిగింది. యువనేత కొట్టు విశాల్ హాజరై భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. సర్కిల్ అధ్యక్షుడు బోలెం రమణ, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు రామలక్ష్మి, అయితం శివ, పద్మావతి, మధు, లీల, నాగమణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): చిన్నారులకు తాడేపల్లిగూడెం డైమండ్స్ క్లబ్ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని క్లబ్ సభ్యురాలు డాక్టర్ కేఈ కమల అన్నారు. స్థానిక లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోమ్‌లో స్మైల్ డెంటల్స్ డైరెక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. రైస్ బ్యాగ్‌లు, ఆయిల్ టిన్స్, నిత్యావసర సరుకులు అందజేశారు. కె.వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ ఆధ్వర్యాన స్వచ్ఛ భారత్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం భారత ఆహార సంస్థ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) జిల్లా కార్యాలయం తాడేపల్లిగూడెం ఆధ్వర్యాన పట్టణంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. స్థానిక భాగ్యలక్ష్మిపేట 19వ వార్డు పార్క్ పరిసరాల్లో చెత్తచెదారాన్ని తొలగించారు. ఎఫ్‌సీఐ మేనేజర్ జి.రంజిత్, పవన్ మణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.







